

రాత్రి తొమ్మిది దాటింది. వార్తల ముఖ్యాంశాలు విని టి.వి. కట్టేసి బాల్కనీలోకి వచ్చి పడక కుర్చీలో కూర్చుని సిగరెట్ పెట్టె తెరిచాను. ఒక్కటే ఉంది. తీసి ముట్టించాను. కిందకు వెళ్లి సిగరెట్లు తెచ్చుకోవాలి. తొమ్మిదిన్నర దాటితే బడ్డీకొట్టు మూసేస్తాడు. తోటలోని చెట్లమీంచి చల్లటి గాలి వీస్తోంది. సాయంత్రాలు అక్కడ ఎంతసేపు కూర్చున్నా నాకు విసుగు అనిపించదు. చాలాసార్లు పడక కుర్చీలోనే నిద్రపోతుంటాను.

సిగరెట్ తాగడం ముగించి సిగరెట్ పీక కుర్చీ కిందున్న యాష్ ట్రేలో కుక్కి, లేద్దామనుకునేంతలో చొక్కా జేబులోని సెల్‌ఫోను మోగింది. బయటకు తీశాను. వచ్చిన నెంబరు కొత్తది. ఎవరిదో అర్థం కాలేదు.

# తీరు

కథ

కరుణాకర్

"చెప్పండి" అన్నాను.

"ఎవరు మాట్లాడుతోంది?"

"మీకు ఎవరు కావాలండీ?"

"మాట్లాడుతోంది ఎవరో తెలుసుకోవచ్చా?"

నాకు తెలిసినవాళ్లు ఎవరో నన్ను ఆటపట్టించడానికి అడుగుతున్నారని ముందు అనిపించింది. కాని ఫోను చేసినతని కంఠస్వరం కొత్తగా ఉంది. ముందు ఎప్పుడూ వినలేదు. సెల్ కట్టేద్దామనుకునేంతలో అతనే నా సెల్ నెంబరు చెప్పి, "మీరు ఏమనుకోకండి. ఈ సెల్ మీ స్వంతదే కదూ?" అడిగాడు.

నవ్వి, "అవును. ఎందుకలా అడుగుతున్నారు?" అడిగాను.

"మీ పేరు తెలుసుకోవచ్చా?"

"ఎందుకు?" విసుగ్గా అన్నాను.

"దయచేసి కోపం తెచ్చుకోకండి. నేను వనస్థలిపురం నుండి మాట్లాడుతున్నాను. నా పేరు జయరాం. మాదాపూర్‌లో ఉద్యోగం చేస్తున్నాను. నా వయసు నలభయి సంవత్సరాలు..." ఆగాడు. ఏదో చెప్పడానికి తటపటాయిస్తున్నట్లు అనిపిస్తోంది.

"మీకు కావలసింది ఖచ్చితంగా ఈ నెంబరేనా?"

"అవును. మీరు ఎక్కడ పని చేస్తున్నారు?"

ముక్కూ ముఖం తెలియని ఒక అజ్ఞాత వ్యక్తికి నా వివరాలు ఎందుకు చెప్పాలనిపించింది. అతని పేరు నిజంగా జయరామో, అతను చెప్పిన వివరాల్లో ఎంతవరకు నిజం ఉందో నాకు ఏమాత్రం తెలియదు. అతను నాకు ఏదో చెప్పబోతున్నాడు. వినాలనిపించి,

"నా పేరు సభాపతి" అని నేను ఎక్కడ ఉద్యోగం చేస్తున్నానో చెప్పాను. రెండు విషయాలు అబద్ధాలే.

"నాకో బాబు. ఎనిమిది చదువుతున్నాడు. నా భార్య..." ఒక్క క్షణం ఆగి, "మాది ప్రేమ వివాహం..." అంటూంటే అతని మాటలకు అడ్డు తగిలి, "ఈ సంగతులు మీరు ఎందుకు చెబుతున్నారో నాకు అర్థం కావడం లేదు" అన్నాను.

"రెండు నిమిషాలు ఓపిక పట్టండి. మీకు అన్నీ వివరంగా చెబుతాను. మీకెంత మంది పిల్లలు?"

వెంటనే జవాబు చెప్పలేదు.

"మీకు పెళ్లి కాలేదా?" అడిగాడు.

చిన్న చిన్న ప్రశ్నలతో నన్నెక్కడకు తీసుకువెళ్తున్నాడో నాకు అర్థం కావడం లేదు.

"మీరు ఎక్కడ ఉంటున్నారు?"

ఆఫీసులో నాది లావాదేవీల కుర్చీ. నా కాళ్లకిందకు నీళ్లు ఎప్పుడు వస్తాయో నాకే తెలియదు. ఉధృతంగా వస్తే నన్ను ఎవరూ ఆదుకోరని నాకు బాగా తెలుసు. కొట్టుకుపోతాను. విచారణలాటిదేమయినా మొదలయి ఉంటే నా గురించిన వివరాలన్నీ జయరాం ఈ పాటికే తెలుసుకుని ఉండాలి. నాకు హింట్ ఇచ్చే విధంగా ఎందుకు అడగడం? సెల్ ఆపివేస్తే నా మీద అనుమానం ఎక్కువ చేసుకున్నవాడినవుతాను. తప్పులు చేయని వాడినని కాదు. తెలియక కొన్ని, తెలిసి మరిన్ని చేయలేదని కాదు.

"విద్యానగర్‌లో ఉంటున్నాను" అన్నాను.

"ఎక్కడ?"

"అడిక్‌మెట్‌లో".

"ఎక్కడ పని చేస్తున్నారు?"

"పని చేయడం లేదు".

"అదేమిటి?"

"కేంద్ర ప్రభుత్వ సంస్థలో పనిచేసి నాలుగు సంవత్సరాల కిందట పదవీ విరమణ చేశాను. ఇప్పుడు నా వయసు అరవయి నాలుగు సంవత్సరాలు. పన్నెండు సంవత్సరాల కిందట నా భార్య చనిపోయింది. నాకు ఇద్దరు కుమార్తెలు. ఇద్దరికి పెళ్లిళ్లు అయిపోయాయి. పెద్దమ్మాయి బెంగుళూరులో, చిన్నమ్మాయి అమెరికాలో ఉంటున్నారు. అదృష్టవశాత్తూ కొడుకులు లేరు. ఇంట్లో నేనొక్కడినే ఉంటాను..."

నా మాటలు జయరాంను ఆశ్చర్యంలో ముంచేశాయేమో? వెంటనే మరో ప్రశ్న రాలేదు. నా గురించి వేరేవిధంగా ఊహించు కుని ఉండాలి.

రెండు క్షణాలాగి, "మీ స్వరం వింటుంటే మీకంత వయసు ఉంటుందని ఎవరూ అనుకోరు. నా మటుకు నాకు నమ్మబుద్ధి కావడం లేదు" అన్నాడు.

"ఇంతకూ మీరు నాకు ఎందుకు ఫోను చేశారో చెప్పలేదు".

"నా భార్య పేరు అనురాధ. ఆమె పోస్టుపెయిడ్ సెల్ బిల్లులు నేను ఎప్పుడూ చూడను. తనే కట్టుకుంటుంది. ఈ సాయంత్రం ఆమె ఇంట్లో లేకపోవడం వలన కొరియర్ వాడు బిల్ నాకు

ఇచ్చాడు. తీరా చూస్తే ఎక్కువ కాల్స్ మీ ఫోనుకే ఉన్నాయి. పోయిన నెల ఆరో తేదీ రాత్రి పదకొండు నుండి ఒంటిగంటన్నర వరకు కాల్ మీకే ఉంది. అది సెల్ నుండి సెల్‌కు ఫ్రీ అయినా ఆరోజు అంతసేపు, ఆమె సెల్ నుండి మీ సెల్‌కు ఎందుకు అన్ని కాల్స్ వస్తున్నాయో నిజంగా నాకు అర్థంకావడం లేదు. నిజం చెప్పాలంటే చాలా బాధగా కూడా ఉంది. అనురాధ మీకు బాగా తెలుసా? గంటల తరబడి మాట్లాడుకునే పరిచయం ఉందా?" నిలదీసి అడుగుతున్నట్టుగా లేకపోయినా అతని స్వరంలో దీనత్వపు పొర స్పష్టంగా ధ్వనించింది.

"నా వయసు ఎంతో మీతో చెప్పాను. అనురాద గారికి మహా అయితే ముప్పయి అయిదు సంవత్సరాలకు మించి ఉండకపో వచ్చు. ఏ సంబంధం ఊహించుకోడానికి ఆస్కారం లేనేలేదు. నా చిరునామా ఇస్తాను. మీరు నా ఇంటికి వచ్చి నిజానిజాలు మీ అంతట మీరే తెలుసుకోండి. ఇంకో సంగతి. పోయిన నెల రెండో తేదీ నుండి పదిహేనో తేదీ వరకు నేనీ ఊళ్లో లేను. బెంగుళూరులో ఉంటున్న మా పెద్దమ్మాయి దగ్గరున్నాను. మీ సెల్ రోమింగ్ అయి ఉంటే బిల్‌లో ఊరు పేరు కూడా ఉంటుంది. ఒకసారి చూడండి".

జయరాం చేతిలో బిల్లు ఉందనుకుంటాను. చూస్తున్నాడేమో వెంటనే సమాధానం రాలేదు. పది క్షణాలు ఆగి, "చూశారా?" అడిగాను.

"హైదరాబాద్ అనే ఉంది" నెమ్మదిగా అన్నాడు.

"కంప్యూటరు బిల్లు అయినా, ఎప్పుడో ఒకసారి ఇలా తప్పులు పడుతుంటాయి. రేపు ఉదయాన్నే వాళ్ల దృష్టికి తీసుకెళ్లి దులిపి వేయండి. ఊరుకోవద్దు. సెల్ మీ పేరున ఉందా, అనురాధగారి పేరున ఉందా?"

"ఆమె పేరు మీద ఉంది".

"అయితే ఆమెచేతే అడిగించండి".

"మిమ్మల్ని అనవసరంగా ఇబ్బంది పెట్టాను. క్షమించండి".

"అదేంలేదు" అని సెల్ కట్టేసి తేలికగా గాలి పీల్చుకుని చెప్పులు తొడుక్కున్నాను. సెల్ చార్జిలో పెట్టి వీధి తలుపులు దగ్గరగా వేసి బయటకు వచ్చాను. తొమ్మిదిన్నర కావస్తున్నా బడ్డీకొట్టు తెరిచే ఉంది. సిగరెట్ పేకట్ కొని ఒకటి తీసి వెలిగించాను. జయరాంతో మాట్లాడాక నా బుర్ర వేడెక్కిపోయింది. అతను ఎంత బాధకు లోనయి ఉంటాడో నేను అర్థం చేసుకోగలను. పగటి సమయంలో అనురాధకు తెలియకుండా వాళ్ల పనిమనిషి తనకు తెలిసిన వాళ్లెవరితోనో అంతసేపు మాట్లాడిందంటే ఆమెకు తెలియకుండా జరిగిందని అనుకోవచ్చు. రాత్రి అదీ ఆ సమయంలో అంతసేపు మాట్లాడడం ఎన్నో అనుమానాలకు దారితీస్తుంది. నా మాటలు జయరాం అనుమానాలను తగ్గించాయో, లేదో? సిగరెట్ తాగడం ముగించే వరకు కొట్టు ఎదురుగా ఉన్న బల్ల మీద కూర్చున్నాను.

ఇంట్లోకి వచ్చి, చెప్పులు గోడవారగా పెట్టి నా భార్య జయ వంక చూశాను. గది నిశ్శబ్దంగా ఉంది. టి.వి. ఆర్పేసి ఉంది. పక్క గదిలో పిల్లలు నిద్రపోతున్నట్టుంది. జయ చేతిలో ఉంది ముందు టి.వి. రిమోట్ అనుకున్నాను. కాదు. నా సెల్‌ఫోను. జయ ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చోగానే సెల్ నాకు అందిస్తూ, "ఎవరో జయరాం అట, మీరు బయటకు వెళ్లిన దగ్గర నుండి మీరిప్పుడు ఇంట్లోకి వచ్చేవరకు నాతో మాట్లాడుతూనే ఉన్నాడు. మీ గురించి, నా గురించి పిల్లల గురించి, మీరు ప్రస్తుతం ఎక్కడ పని చేస్తుందీ, మనం ఎక్కడ ఉంటుందీ దాదాపు అన్ని సంగతులు వివరంగా అడిగాడు. ముందు చెప్పకూడదనుకున్నాను. తను మీ చిన్ననాటి స్నేహితుడనని, దుబాయిలో ఉంటూ చాలా సంవత్సరాల తర్వాత ఈ సాయంత్రం హైదరాబాద్ వచ్చానని చెప్పేసరికి అన్నీ చెప్పేశాను..." అని నా ముఖంలోకి పరీక్షగా చూసింది. మునుపు ఎప్పుడూ జయ నన్నలా చూడలేదు. ఎప్పుడూ సంతోషంగా ఉండే మనిషి ఉదాసీనంగా ఉన్నట్టు అనిపించింది. లేక అది నా ఆలోచనలో మార్పా?

నా గుండెలో రాయి పడింది. అనురాధ నాకు చెప్పినంత అమాయకుడిలా జయరాం అనిపించడం లేదు. అతను మళ్లీ ఫోను చేస్తాడని నేను ఊహించలేదు. బయటకు వెళ్లేప్పుడు సెల్ తీసుకువెళ్లి ఉండవలసింది. తీసుకువెళ్లకుండా పెద్ద పొరపాటు చేశాను. జయకు నా గురించి చాలా విషయాలు తెలియవు. నేనేదో గొప్ప వ్యక్తినని అనుకుంటోంది. అతనికి ఇంకా ఏమేమి విషయాలు చెప్పావని అడిగితే ఇప్పటివరకు నా మీద తనకు లేని అనుమానాలు కలిగించినవాడినవుతాను. అనురాధ వాళ్లింట్లో పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవాలని అనిపిస్తోంది. సెల్ ఆమె దగ్గరుందో అతని దగ్గరుందో? జయరాం మళ్లీ నాకు తప్పకుండా ఫోను చేస్తాడు. ఈసారి ఊరుకోడు. సెల్ కట్టేశాను.

●

**పగటి సమయంలో అనురాధకు తెలియకుండా వాళ్ల పనిమనిషి తనకు తెలిసిన వాళ్లెవరితోనో అంతసేపు మాట్లాడిందంటే ఆమెకు తెలియకుండా జరిగిందని అనుకోవచ్చు. రాత్రి అదీ ఆ సమయంలో అంతసేపు మాట్లాడడం ఎన్నో అనుమానాలకు దారితీస్తుంది. నా మాటలు జయరాం అనుమానాలను తగ్గించాయో, లేదో?**

